క్లుప్తంగా

స్తంభాద్రి ఆలయంలో సుదర్శన యాగం



సుదర్శన యాగం నిర్వహిస్తున్న అర్చకుడు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సుదర్శన యాగాన్ని(రుణ విమోచన హోమం) ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరాజన మంత్ర పుష్పం, విశేష పూజ, నివేదన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కార్యక్రమాలను సంప్రదాయ పద్ధతుల్లో జరిపించారు. శ్రీ సుదర్శన యాగంలో భక్తులు పాల్గొని హోమం, పూజలు చేశారు.

6న సినీ మధుర గీతాల ఆలాపన

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని జూబ్లీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 6వ తేదీ(శనివారం) సాయంత్రం 6గంటలకు గాన మాధురి సినీ సంగీత మధుర గీతాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు అంజాద్‌పాషా, ఎస్వీ రమణ, జనార్దన్, జాఫర్, ప్రకాష్, శివలీల నాగస్వర్ణశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గాయనీ, గాయకులు పాల్గొంటున్నారని, కళాకారులు, కళాభిమానులు అధిక సఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: ఈనెల 5న నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద నిర్వహించే బుద్ధ పౌర్ణమి జయంతి ఉత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను భారతీయ బౌద్ధ మహాసభ ఖమ్మం జిల్లా సభ్యులు బుధవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఈ వేడుకలు నిర్వహించబడతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ హెచ్.బసవయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్, కలకోట సంపత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్ నాయక్, కార్యదర్శి ఈదయ్య పాల్గొన్నారు.

మృతురాలి నేత్రాలు నేత్రనిధికి అందజేత

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంలో సీపీఎం సానుభూతి పరురాలు గుడిసె రాములమ్మ(75) బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా, రాములమ్మ నేత్రాలను కుటుంబ సభ్యులు నేత్రనిధికి అందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్-2
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఈవిల్ డెడ్ రైజ్
ఆదిత్య	ఏజెంట్
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	50		10
కాకర	50	చుక్కకూర	2
సొరకాయ	16		10
బీర	50	తోటకూర	2
దొండ	24		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	40		15
క్యాప్సికం	46		

-ఖమ్మం వ్యవసాయం

ఈ మురుగుకు దారెటు..?

మురికి కూపాలకు నిలయంగా శ్రీనగర్‌కాలనీ

- ఖాళీ జాగాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు
- దుర్వాసనతో కాలనీవాసుల అవస్థలు
- వ్యాధుల బారిన పడుతున్న వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మురుగు నిల్వలతో దుర్భరంగా మారిన శ్రీనగర్‌కాలనీలోని ఓ ప్లాట్

ఖమ్మంఅర్బన్: నగరంలో సంపన్నుల కాలనీగా పేరున్న శ్రీనగర్‌కాలనీలో ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచిపోతోంది. ఈ మురుగుకు దారేటు? అని ప్రశ్నార్థకంగా మారి.. మురుగు నిల్వలతో కంపు కొడుతూ నివాసులు నానా అవస్థలు పడుతున్నారు. 13వ డివిజన్‌లోని 13వ లైన్‌లో అనేక నిర్మాణాలు, అపార్ట్‌మెంట్‌లతో అందమైన కాలనీగా దర్శనమిస్తున్న ప్రాంతంలో నివాసాలు చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఒక వైపు డ్రెయిన్లు లేక పోవడంతో పాటు, ఉన్న కచ్చా డ్రెయిన్లు సైతం సక్రమంగా లేక పోవడంతో నీరంతా ఖాళీ జాగాల్లో నిలిచి మురికి కూపాలుగా మారాయి.

దుర్వాసన..

నగరంలో కోట్లాది రూపాయలు ఖర్చుతో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాలకులు పట్టించుకోవడం లేదని నివాసులు మండిపడుతున్నారు. ఈ ప్రాంత నివాసాలు నిత్యం రాకపోకలు సాగించే సమయాన వాసన భరించలేక ముక్కు మూసుకొని సాగించాల్సి వస్తోంది. ఈ వీధిలోని నివాసాల వాడకం నీరే కాకుండా చుట్టుపక్కల అనేక వీధుల్లోని నీరు సైతం పారడానికి ఇదే మార్గం కావడంతో నిత్యం మురుగు నీరు చేలఏరులా పారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పందుల స్వైర విహారం..

మురుగు కూపాలలో పందులు నిత్యం స్వైర విహారం చేయడంతో దుర్వాసన వెదజల్లుతోతంది. అంతేకాక దోమలు వృద్ధి చెంది కాలనీవాసులను మరింత భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏ రోగాల బారిన పడతామోనని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ బాధలను గుర్తించి మురుగు నీరు నిల్వలు లేకుండా.. ఎప్పటికప్పుడు ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.





13వ లైన్‌లో డ్రెయిన్లు, మురుగు గుంతలు

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి



విక్రయదారులతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 31వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలోని అన్ని డివిజన్‌లలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోనిప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పరిశీలన..

నగరంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌లో స్టాళ్లను సందర్శించి, సౌకర్యాలను పరిశీలించారు. కూరగాయల విక్రయదారులు, వినియోగదారులతో మాట్లాడారు. మార్కెట్‌లో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీఈ నవ్యజ్యోతి, స్వరూపరాణి, సిటీ గ్రంథాలయ చైర్మన్ అష్రఫ్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, పైడిపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద పని చేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి చట్టం కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600లు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇవ్వాల్సిన వేతనాలను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం దారుణమన్నారు. ఆర్.శివలింగం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు కంకణాల అర్జున్‌రావు, రెంటాల యాదగిరి, బీరెల్లి లాజరు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, వెంకటఅప్పారావు, గంటా శ్రీనివాసరావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చయ్య

ఖమ్మంమయూరిసెంటర్: అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నందున ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగం ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షాలతో కొట్టుకుపోతోందని తెలిపారు. గతంలో సీఎం ప్రకటించిన పరిహారం చెల్లించడమే కాక, పంట కొనుగోళ్లు వేగంగా చేపట్టాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మారుతి, మల్లయ్య, గంటా శ్రీనివాసరావు, ఎడ్లపల్లి నవీన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

'తెలంగాణ భరోసా'ను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

తిరుమలాయపాలెం: హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీన కుమారి మాయవతి పాల్గొనే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ పాలేరు ఇన్‌చార్జ్ అల్లిక వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని బీరోలులో జరిగిన సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో గడీల పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకన్న, లింగయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ..

ఖమ్మం మామిళ్లగూడెం: బీఎస్పీ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో నిర్వహించే 'తెలంగాణ భరోసా' సభ కరపత్రాలను బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌లు మేకతొట్టి పుల్లయ్య, పీసీ వీరస్వామి మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రసాహు, ఉపాధ్యక్షులు నాగేశ్వరావు, మిరాయాల నాగరాజు, జిల్లా కార్యదర్శి అయితగాని శ్రీనివాస్‌గౌడ్, సుభాష్ చంద్రబోస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

డీఎంహెచ్‌ఓకు..



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం పీహెచ్‌సీలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం డీఎంహెచ్‌ఓ మాలతి, వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకొచ్చినా సౌకర్యాలు మెరుగుపడలేదని, ఇకనైనా దృష్టి సారించాలని కోరారు. నాయకులు మహేందర్, సురేష్, భద్రయ్య, వెంకన్న, మహేష్, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ, తహసీల్దార్‌లకు..



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్: వరంగల్ క్రాస్‌రోడ్‌కు కేటాయించాల్సిన రేషన్‌షాపును నాయుడుపేటకు కేటాయించడం సరికాదని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఈమేరకు రేషన్‌షాపును వరంగల్ క్రాస్‌రోడ్‌కే కేటాయించాలని కోరతూ బుధవారం ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, రూరల్ తహసీల్దార్‌లకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. 600పైగా రేషన్ కార్డులు కలిగిన వరంగల్ క్రాస్‌రోడ్‌కు బదులు పెద్దతండా రేషన్‌షాపు పరిధిలోని నాయుడుపేటకు చెందిన ఒక్క రేషన్ కార్డు కూడా లేనప్పటికీ నాయుడుపేటకు ఎలా కేటాయించారో తెలపాలన్నారు. సీపీఐ నాయకులు మిడకంటి చినవెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, చెరుకుపల్లి భాస్కర్, రాంకోటి, వెంపటి సురేందర్, బట్టబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ఖమ్మంఅర్బన్: గిరిజన మహిళను ఆటోలో బలవంతంగా తీసుకెళ్లి గాయాలతో ఆస్పత్రిలో వదిలేయగా చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయనతో పాటు సంఘం నాయకులు బానోత్ భీష్మ నాయక్, తారాదేవి తదితరులు జిల్లా ఆస్పత్రిలో మృతదేహం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సంక్షేమానికి ఉద్యమం తప్పదు



కూసుమంచి: వేడుకలో పాల్గొన్న నాయకులు

నేలకొండపల్లి: కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమం తప్పదని నేలకొండపల్లి–కూసుమంచి ఆటో అడ్డా యూనియన్ అధ్యక్షుడు పులిపాటి వెంకన్న హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యాక్షుడు ఎండీ.పాషా, ప్రధాన కార్యదర్శి నరేందర్, దారా వెంకటనారాయణ, పొల్లూరి రవి, బల్లి వీరయ్య, మాజీ అధ్యక్షుడు బల్లి వెంకన్న, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గోపి, నేలకొండపల్లి ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, మాజీ సర్పంచ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో..

కూసుమంచి: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం కూసుమంచిలో మేడే వేడకల సందర్భంగా పతాకావిష్కరణ చేసి ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని, అట్టి చట్టాలను పోరాటాల ద్వారా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, రాందాస్, వెంకటేశ్వర్లు, శివలింగం, వెంకయ్య, పుల్లయ్య, నాగేశ్వర రావు, గిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు స్థలాలు, ఇళ్లు, పింఛన్ ఇవ్వాలి



కేక్ కట్ చేస్తున్న జర్నలిస్టులు

నేలకొండపల్లి: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం, పింఛన్లు మంజూరు చేయాలని సీనియర్ జర్నలిస్టు పోలంపల్లి నాగేశ్వరరావు కోరారు. పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యాన బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పత్రికాస్వేచ్ఛతోనే ప్రభుత్వ పథకాలు, ఇతర వ్యవస్థల్లో అవినీతి జరగదని తెలిపారు. నేలకొండపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మైసా శ్రీనివాసరావుతో పాటు ఎస్.డీ.కర్ణ, పీ.వీ.నాగిరెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరెడ్డి, మామిడి వెంకన్న, మారేపల్లి రామదాసు, రాంబాబు, వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, షేక్ ఖాజామియా, కడియాల నరేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

తిరుమలాయపాలెం: టెక్నాలజీ పెరుగుతున్న ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్ల మోసాల ఉచ్చులో ప్రజలు పడకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల ఎస్సై వరాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాత్రి తిరుమలాయపాలెం మండల కేంద్రంలో పోలీస్ కళాజాతా ఆధ్వర్యాన ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిత వ్యక్తులు బ్యాంకు లోన్లు, ఇతర స్కీంలు ఇస్తామని చెప్పి మోసాలకు పాల్పడి ఖాతాల్లోని నగదును స్వాహా చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీం లీడర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన పోలీస్ కళాజాతా బృందం నాటికలు, జానపదాలు ప్రజలను ఆలోచింపజేశాయి.

పొంగులేటి పూజలు



పూజలు చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహ, నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, గోల్‌తండా సర్పంచ్ బానోత్ రంగ, గ్రామ పెద్దలు సైదా, పోట్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి వద్ద లారీ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనదారుడు బోడ నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తిరుమలాయపాలెం మండలం బంధంపల్లికి చెందిన నరేష్ బుధవారం ఖమ్మం వెళ్లి వస్తుండగా కరుణగిరి వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈఘటనలో ఆయన తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా చికిత్సా నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

ట్యాంకు బండ్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం లకారం ట్యాంకు బండ్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్‌పై 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం పెట్టడం మహనీయులను అవమానిస్తూ, తమ కులహంకారాన్ని చాటుకోవడమేనన్నారు. శ్రీకృష్ణ అవతారంలో ఎన్టీఆర్ విగ్రహం పెడితే హిందువుల మనోభావాలు దెబ్బతినవా అని ప్రశ్నించిన ఆయన బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదన్నారు. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే వంటి మహానుభావులను పట్టించుకోకుండా రాజకీయ నేతలు విగ్రహాలను పెట్టడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందని ఆయన పేర్కొన్నారు.


అలిగి ఇంటి నుంచి వచ్చేసిన యువతి

ఖమ్మం మామిళ్లగూడెం: తల్లి మందలించిందంటూ ఓ యువతి ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. ఈమేరకు ఆమె బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌కు చేరుకుని బస్సు ఎక్కేందుకు యత్నించింది. దీంతో యువతిని వెతుకుతూ బస్టాండ్ చేరిన తల్లి ఆమెను ఆర్టీసీ అధికారుల సాయంతో బుజ్జగించి తీసుకెళ్లింది.

జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం

ఖమ్మంరూరల్/ కామేపల్లి(కారేపల్లి)/నేలకొండపల్లి: సమస్యల పరిష్కారం కోరుతూ గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బుధవారం సీపీఐ, సీఐటీయూ, టీఎస్‌టీటీఎఫ్ నాయకులు వేర్వేరుగా సమ్మె చేస్తున్న శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు, టీఎస్‌టీటీఎఫ్ జిల్లా కన్వీనర్ బానోత్ వీరునాయక్,జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకుడు బైరం దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. కార్యదర్శుల కృషి మూలంగానే రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ అవార్డులు వచ్చాయని, ఇప్పటికైనా వారి సేవలను గుర్తించి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నేలకొండపల్లిలో సమ్మె చేస్తున్న కార్యదర్శులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర్‌లాల్, మంగనాయక్, హరి, కిషోర్, లక్ష్మణ్, లింగరాజు, బోళ్ల వీరబాబు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మహేష్, వి.ధర్మేంద్ర, వీరబాబు, నాగేశ్వరరావు, రామయ్య, వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు పుచ్చకాయల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'తమ్మినేని'కి వినతి..



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సీఐటీయూ జిల్లా నాయకులు బుధవారం రూరల్ పార్టీ కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కలిసి విన్నవించారు. దీనికి తమ్మినేని స్పందిస్తూ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.మోహన్‌రావు, వంగర ధర్మేందర్, నర్సయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.